సబ్‌జైలును సందర్శించిన జడ్జి

రికార్డులను పరిశీలిస్తున్న జడ్జి దేవరపల్లి కీర్తి చంద్రికారెడ్డి

ఇల్లెందు/ ఇల్లెందు రూరల్, అక్టోబర్ 29 : ఇల్లెందు సబ్‌జైలును ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి దేవరపల్లి కీర్తి చంద్రికారెడ్డి మంగళవారం సందర్శించారు. గోవిందసెంటర్‌లోని సబ్ జైలును సందర్శించి రికార్డులను తనిఖీ చేశారు. ఖైదీలకు మెనూ ప్రకారం సదుపాయాలు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఆర్థిక స్తోమత లేని ఖైదీలకు ఫ్రీ లీగల్ ఎయిడ్ క్లీనిక్ నుంచి న్యాయవాదిని నియమిస్తామన్నారు. కార్యక్రమంలో సబ్‌జైలు సూపరింటెండెంట్ చంద్ర శేఖర్, సిబ్బంది శ్రీనివాస్, సాంబ, దుదియా, కీర్తి కార్తిక్, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

దీపావళిని సంతోషంగా జరుపుకోవాలి: సీఐ

టేకులపల్లి, అక్టోబర్ 29 : దీపావళి పండుగను భద్రతా ప్రమాణాలు పాటిస్తూ ప్రజలందరూ సంతోషంగా జరుపుకోవాలని టేకులపల్లి సీఐ తాటిపాముల సురేశ్ అన్నారు. మంగళవారం టేకులపల్లి పోలీస్ స్టేషన్‌లో సీఐ మాట్లాడుతూ దీపావళి పండుగ రోజు పేలుడు పదార్థాలను జాగ్రత్తగా కాల్చాలని సూచించారు. పటాకుల విక్రయాలకు అనుమతి తీసుకోవాలని, లేకుంటే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఉపాధి కూలి డబ్బులు ఇవ్వడంలేదు

దుమ్ముగూడెం, అక్టోబర్ 29: స్వయం సహాయక సంఘంలో ఉన్న పొదుపు డబ్బులు కట్టడం లేదని ఉపాధిహామీ డబ్బులు ఇవ్వకుండా ఏపీజీవీబీ సిబ్బంది ఇబ్బందులకు గురిచేస్తున్నారని బాధిత మహిళలు పేర్కొన్నారు. ఈ విషయాన్ని బాధితులు అఖిలభారత ప్రగతిశీల రైతుకూలీ సంఘం నాయకులు వీరభద్రం దృష్టికి మంగళవారం తీసుకు వచ్చారు. దుమ్ముగూడెంలో వీరభద్రం బాధిత మహిళలతో కలిసి విలేకరులతో మాట్లాడారు. మండలంలోని అడవిరామవరం గ్రామానికి చెందిన తొమ్మిది మంది మహిళలు ఉపాధి పనులు చేయగా కూలీ డబ్బుల కోసం లక్ష్మీనగరంలోని ఏపీజీవీబీకి వెళ్లగా మీకు పొదుపు ఖాతాలో అప్పు ఉందని, ఆ అప్పును తీర్చకుండా ఉపాధి డబ్బులు ఇవ్వడం కుదరని బ్యాంకు సిబ్బంది చెప్పారన్నారు. స్వయం సహాయక సంఘాల బాధ్యులు, ప్రభుత్వం బాధ్యత తీసుకుని ఉపాధి పనులు చేసిన వాటికి డబ్బులు ముడిపెట్టకుండా ఇప్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బాధిత మహిళలు సున్నం సునీత, మడివి రాజమ్మ, అడవి చంద్రమ్మ, మడవి భద్రమ్మ పాల్గొన్నారు.

కేవోసీ టిప్పర్ డ్రైవర్ల చర్చలు సఫలం

ఇల్లెందు, అక్టోబర్ 29 : కేవోసీ టిప్పర్ డ్రైవర్ల వేతనల పెంపు విషయంలో యాజమాన్యంతో జరిగిన చర్చలు సఫలమయ్యాయని టీయూసీఐ నాయకులు యాకుబ్ షావలి అన్నారు. మంగళవారం ఇల్లెందు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా నాయకులు, టిప్పర్ అసోసియేషన్ యాజమాన్యంతో చర్యలు జరిగాయి. ఈ చర్చల్లో కార్మికుల వేతనాలు రూ.550 నుంచి రూ.610 పెంచుతూ ఒప్పందం కుదిరింది. బేటాలు ట్రిప్ మాములు కలిపి అదనంగా మాస్టర్‌కు అన్నీ కలిపి రూ.110 పెరిగాయని తెలిపారు. కార్యక్రమంలో టిప్పర్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు కోరం సురేందర్, నరసింహారావు పాల్గొన్నారు.

మునగసాగు సన్న, చిన్నకారు రైతులకు వరం

బూర్గంపహాడ్, అక్టోబర్ 29: మార్కెట్‌లో డిమాండ్ ఉన్న మునగసాగు చేస్తే సన్న, చిన్నకారు రైతులకు వరంగా మారుతుందని ఎంపీడీవో జమలారెడ్డి అన్నారు. మంగళవారం బూర్గంపహాడ్, నాగినేనిప్రోలు రెడ్డిపాలెం, తాళ్లగొమ్మూరు, కోయగూడెం గ్రామాలకు సంబంధించి బూర్గంపహాడ్, తాళ్లగొమ్మూరు రైతువేదికల్లో, కృష్ణసాగర్ పంచాయతీ కార్యాలయంలో మునగసాగుపై గ్రామసభ నిర్వహించారు. గ్రామసభల్లో వ్యవసాయశాఖ ఏడీఏ తాతారావు, ఈజీఎస్ ఏపీవో విజయలక్ష్మి, ఏవో శంకర్, ఏపీఎం నాగార్జున, ఏఈవోలు, ఈజీఎస్ ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్లు, ఆయా పంచాయతీల కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆదివాసీ యువకులకు వాలీబాల్ కిట్ అందజేత

పినపాక, అక్టోబర్ 29: మండలంలోని సుందరయ్య నగర్ ఎర్రగుంట కాలనీ చెందిన వలస ఆదివాసీ యువకులకు ఈబయ్యారం సీఐ వెంకటేశ్వరరావు, ఎస్సై రాజ్‌కుమార్ స్థానిక పోలీస్ స్టేషన్‌లో మంగళవారం వాలీబాల్ కిట్లను అందజేసి మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చత్తీస్‌గఢ్ నుండి బతుకుదెరువు కోసం వచ్చిన ఆదివాసీ యువకులు సత్రప్రవర్తనతో మెలగాలని అన్నారు. తమ గ్రామాలకు ఎవరైనా కొత్త వారు వస్తే వెంటనే దగ్గర్లోని పోలీస్ స్టేషన్లకు సమాచారం అందివ్వాలని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

'సీతారామ' పనులను అడ్డుకుంటాం..

ఎకరానికి రూ.20 లక్షల నష్టపరిహారం ఇవ్వాలి

జూలూరుపాడు గ్రామసభలో భూ నిర్వాసితులు

గ్రామసభలో అధికారులతో మాట్లాడుతున్న భూనిర్వాసిత రైతులు

జూలూరుపాడు, అక్టోబర్ 29 : సీతారామ ప్రాజెక్ట్ లింక్ కాలువ నిర్మాణంలో భాగంగా భూములు కోల్పోతున్న రైతులకు ఎకరానికి రూ.20 లక్షల నష్టపరిహారం ఇవ్వకుంటే పనులను అడ్డుకుంటామని భూ నిర్వాసితులు తేల్చిచెప్పారు. మంగళవారం జూలూరుపాడు పంచాయతీ కార్యాలయంలో భూ నిర్వాసిత రైతులతో పాల్వంచ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జే.కాశయ్య అవార్డు విచారణ గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు ప్రభుత్వం ఎకరానికి రూ.13.50 లక్షల నష్టపరిహారం ఇస్తుందని ప్రకటించారు. దీంతో గ్రామసభకు వచ్చిన రైతులు మాట్లాడుతూ ఎకరానికి రూ.20 లక్షల నష్టపరిహారం ఇవ్వకుంటే పనులు జరగనివ్వమని హెచ్చరించారు. పర్యటనలో భాగంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఇక్కడికి వచ్చినప్పుడు భూనిర్వాసిత రైతులకు ఎకరానికి రూ.20 లక్షలు ఇస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. జూలూరుపాడు రెవెన్యూ పరిధిలో 20 మంది రైతులకు చెందిన 28 ఎకరాల భూమిని కాలువ నిర్మాణంలో కోల్పోతున్నారు. వీరంతా గ్రామసభకు వచ్చి సంతకాలు పెట్టకుండా వెనుదిరగడంతో ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని అధికారులు తెలిపారు. ఈ గ్రామసభలో సీతారామ ప్రాజెక్ట్ డీఈ చంద్రశేఖర్, ఏఈ సాగర్, ఎఫ్ఆర్‌వో నాగసాయిప్రసాద్, ఆర్ఐ తిరుపతిరావు పాల్గొన్నారు.

నష్టపరిహారం ఇప్పించాలని ఎమ్మెల్యేకి వినతి

జూలూరుపాడు, అక్టోబర్ 29 : సీతారామ ప్రాజెక్ట్ కెనాల్ కింద భూములు కోల్పోయిన మండల పరిధిలోని ఎలకలొడ్డు గ్రామానికి చెందిన రైతులకు నష్టపరిహారం ఇప్పించాలని కోరుతూ వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్‌కి మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఎలకలొడ్డు గ్రామ సమీపంలో 17మంది రైతులు పోడు సాగు చేసుకొని జీవనం సాగిస్తున్నారు. ఆ భూములు కాల్వ నిర్మాణంలో పూర్తిగా కోల్పోయారని వీరికి నష్టపరిహారం అందేలా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ ప్రజాపంథా జిల్లా నాయకులు బానోత్ ధర్మా, ఏదులాపురం గోపాలరావు, రైతులు బానోత్ బాలు, గుగులోత్ భీమా, భూక్యా సక్రు, బాదావత్ బోడకా, నూనావత్ సరోజిని, రమణి, స్వప్న, రాములు పాల్గొన్నారు.

లీగల్ వలంటీర్లకు అవకాశం

కొత్తగూడెంటౌన్, అక్టోబర్ 29 : ప్రజలకు న్యాయపరమైన సలహాలతోపాటు వారికి తగిన న్యాయం చేయాలని అనే ఆలోచన ఉన్న ఔత్సాహికులు(టీచర్స్, రిటైర్డ్ గమర్నమెంట్ సర్వెంట్స్, సీనియర్ సిటిజిన్స్, ఎంఎస్‌డబ్ల్యూ స్టూడెంట్లు, అంగన్‌వాడీ వర్కర్స్, వైద్యులు, లా స్టూడెంట్స్, సేవా దృక్పథం కలిగిన ఎన్‌జీవోలు, మైత్రీ సంఘం సభ్యులు డ్వాక్రా మహిళలు తదితరులు) పారా లీగల్ వలంటీర్లుగా పనిచేసేందుకు నవంబర్ 20వ తేదీన సాయంత్రం 5గంటల వరకు తమ సంస్థకు దరఖాస్తు చేసుకోవాల్సిందిగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్, కార్యదర్శి జి.భానుమతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గలవారు బయోడేటా, గుర్తింపుకార్డు, రెండు స్టాంప్‌సైజు ఫొటోలను కొత్తగూడెం జిల్లా కోర్టు కార్యాలయంలో అందజేయాలని తెలిపారు. వలంటీర్లు కనీస విద్యార్హత 10వ తరగతి పాసై ఉండాలని పేర్కొన్నారు.

ఆటోడ్రైవర్ల శ్రమదానం

జూలూరుపాడు, అక్టోబర్ 29 : మండల పరిధిలోని పడమటనర్సాపురం గ్రామం నుంచి మాచినేనిపేట గ్రామం వరకు రోడ్డుకు ఇరువైపులా ఏపుగా పిచ్చిమొక్కలు పెరిగి రోడ్డును కమ్మేయడంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. దీంతో మాచినేనిపేట గ్రామానికి చెందిన ఆటోడ్రైవర్లు మంగళవారం శ్రమదానం చేసి రోడ్డుకు ఇరువైపులా ఉన్న పిచ్చి మొక్కలను తొలగించారు. కార్యక్రమంలో బానోత్ వీరన్న, సాపావత్ బాబూలాల్, బాదావత్ రవి, బోడా మహేశ్, వెంకటేశ్, మంగీలాల్ పాల్గొన్నారు.

నేడు మునగసాగు రైతులకు అవగాహన

బూర్గంపహాడ్, అక్టోబర్ 29: మండలంలోని సారపాక పంచాయతీ కార్యాలయంలో బుధవారం ఉదయం 10 గంటలకు మునగసాగు రైతులకు అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు ఈవో కంది మహేశ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సదస్సులో రైతులు, ఈజీఎస్ వేజ్ సీకర్స్ పాల్గొని విజయవంతం చేయాలని ఈవో కోరారు.

స్వశక్తితో కుటీర పరిశ్రమలు నెలకొల్పుకోవాలి

ఐటీడీఏ పీవో రాహుల్

పరిశ్రమను పరిశీలిస్తున్న పీవో రాహుల్

టేకులపల్లి, అక్టోబర్ 29 : ఉద్యోగాల కోసం ఎదురు చూడకుండా స్వశక్తితో కుటీర పరిశ్రమలను నెలకొల్పి పలువురికి ఉపాధి కల్పించడం అభినందనీయమని భద్రాచలం ఐటీడీఏ పీవో బి.రాహుల్ అన్నారు. మంగళవారం టేకులపల్లి మండల కేంద్రంలో నెలకొల్పిన సఖి నాప్కిన్ యూనిట్‌ను ఆయన పరిశీలించారు. తొమ్మిది లక్షల తొంభైవేల సబ్సిడీతో రూ.16 లక్షల ఖర్చుతో యూనిట్ నిర్మాణం చేపట్టిన నిరుద్యోగులైన ఆరుగురు గిరిజన యువతులను అభినందించారు. యూనిట్‌కాస్ట్, మిషనరీ నాప్కిన్ల తయారీ గురించి మహిళలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందాలని సూచించారు. అనంతరం బోడు గ్రామంలో ఏర్పాటు చేసిన పేపర్ బ్యాగుల తయారీకేంద్రాన్ని సందర్శించి పదిరోజుల్లో యూనిట్ ప్రారంభమయ్యేలా ప్రణాళిక చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సహాయ జేడీఎం హరికృష్ణ, ఐకేపీ ఏపీఎం రవికుమార్, పుల్లమ్మ, మాలోత్ కరుణ, గౌస్య, చిట్టెమ్మ, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

క్యూబాపై అమెరికా నిరంకుశ నిర్బంధాన్ని ఎత్తివేయాలి

మాజీ ఎంపీ మిడియం బాబూరావు

అంబేద్కర్ సెంటర్ వద్ద ధర్నా చేస్తున్న నాయకులు

భద్రాచలం, అక్టోబర్ 29: క్యూబా దేశంపై అమెరికా సామ్రాజ్యవాద పెత్తనంతో నిరంకుశ నిర్బంధాన్ని ఎత్తివేయాలని, అమెరికా విధానాన్ని ప్రపంచవ్యాప్తంగా ప్రతిఒక్కరూ వ్యతిరేకించాలని మాజీ ఎంపీ మిడియం బాబూరావు అన్నారు. మంగళవారం భద్రాచలం అంబేద్కర్ సెంటర్ అమరవీరుల స్తూపాల వద్ద సీఐటీయూ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీ మాట్లాడుతూ ప్రపంచంలో అమెరికా సామ్రాజ్యవాద విధానంతో అనేక చిన్న దేశాలపై ముఖ్యంగా క్యూబాపై ఆర్థిక, నిరంకుశ నిర్బంధాన్ని ప్రయోగిస్తూ 11 మిలియన్ల ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తుందని ఆరోపించారు. ఇప్పటికైనా అమెరికా ప్రపంచ దేశాలపై పెత్తనం వదులుకోవాలన్నారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు ఎంబీ నర్సారెడ్డి, బండారుశరత్, వైవీ రామారావు, నాగరాజు, సున్నం గంగ, డీ సీతాలక్ష్మి, కోరాడ శ్రీనివాస్, కుంజా శ్రీను, భూపేందర్, లక్ష్మణ్, నారాయణ, రత్నం, రామకృష్ణ, రాఘవయ్య, చంద్రలీల, సుధాభవాని, అజయ్‌కుమార్, రాయల రాములు, రాజబాబు, ముత్తయ్య, మురళీకృష్ణ, రవి, రాము, వాసు, బాలాజీ పాల్గొన్నారు.

బీటీపీఎస్‌లో నిఘా అవగాహన వారోత్సవాలు

మణుగూరు టౌన్, అక్టోబర్ 29: మణుగూరు బీటీపీఎస్ (భద్రాద్రి థర్మల్ పవర్ ప్లాంట్)లో ఈ నెల 28 నుంచి నవంబర్ 3వ తేదీవరకు నిఘా వారోత్సవాలు నిర్వహించనున్నట్లు బీటీపీఎస్ సీఈ బిచ్చన్న తెలిపారు. వారోత్సవాల్లో భాగంగా మంగళవారం మణుగూరులో ర్యాలీ నిర్వహించి, ఉద్యోగులు, సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా సీఈ మాట్లాడుతూ నేటి సమాజంలో కులవ్యవస్థ నిర్మూలన జరగాలని, దీనికి ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో విజిలెన్స్ డీఎస్పీ నరేశ్, ఎస్పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ తిరుపతి, సివిల్ ఎస్ఈ పార్వతి, స్టేజ్-1 ఎస్ఈ శ్రీనివాసరావు, సేఫ్టీ డీఈ ఆనంద్‌ప్రసాద్, అడ్మిన్ డీఈ మురళీకృష్ణ, అకౌంట్స్ సిబ్బంది, ఎస్పీఎఫ్, వోఅండ్ఎం, సేఫ్టీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కేటీపీఎస్ బూడిద టెండర్లను గిరిజన కమిటీ సభ్యులకు ఇవ్వాలి

పాల్వంచ, అక్టోబర్ 29 : కేటీపీఎస్ యాష్ పాండ్ బూడిద టెండర్లను ఐటీడీఏ, టీజీ జెన్కో ఎంపిక చేసిన గిరిజన కాంట్రాక్లర్లు 39మంది కమిటీ సభ్యులకు కేటాయించాలని డిమాండ్ చేశారు. పాల్వంచ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఆ కమిటీ సభ్యులు కాంట్రాక్లర్లు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కేటీపీఎస్ యాష్ పాండ్ నుంచి బూడిదను టెండర్ల ద్వారా స్థానిక గిరిజన కాంట్రాక్లర్లకు మాత్రమే ఇవ్వాలని డిమాండ్ చేస్తూ హైకోర్టులో పిటిషన్ వేయడం జరిగిందన్నారు. హైకోర్టు గిరిజనులకే ఇవ్వాలని ఆదేశాలు ఇవ్వడం జరిగిందని, కానీ టీజీ జెన్కో అధికారులు మాత్రం 39మంది కమిటీ సభ్యుల్లో కేవలం ముగ్గురు వ్యక్తులకు మాత్రమే టెండర్లు ఇచ్చారని ఆరోపించారు. సమావేశంలో బట్టు నరేష్, జవహార్‌లాల్, అశోక్, వీరూనాయక్, ప్రసాద్, బట్టు మురళి, శ్రీనివాస్, కృష్ణ, మోహన్‌గాంధీ పాల్గొన్నారు.

పంటలన్నింటికీ మద్దతు ధర ఇవ్వాలి

పాల్వంచ, అక్టోబర్ 29: రైతులు పండించిన వరి, పత్తి, వేరుశెనగ, మొక్కజొన్న తదితర పంటలన్నింటికీ మద్దతు ధర చెల్లించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ ఆధ్వర్యంలో పాల్వంచ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. వరి ధాన్యంకు రూ.3500, పత్తి క్వింటాల్‌కు రూ.18,500, వేరుశెనగ, మొక్కజొన్న, మిర్చి, పప్పు ధాన్యాలన్నింటికీ రూ.30 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. దళారుల ప్రమేయం లేకుండా ప్రభుత్వం పంటలను కొనుగోలు చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.

ట్రైకార్ సబ్సిడీ నిధులను విడుదల చేయాలి

కొత్తగూడెం అర్బన్, అక్టోబర్ 29 : కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 11నెలలు అవుతున్నా గిరిజనులకు ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా నెరవేర్చలేదని గిరిజన సమాఖ్య నేతలు కల్లూరి వెంకటేశ్వర్లు, భూక్యా శ్రీనివాస్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేసి అనంతరం సంబంధితశాఖాధికారికి వినతిపత్రం అందజేసి మాట్లాడారు. ట్రైకార్ సబ్సిడీ రుణాలను విడుదల చేయాలని, యాక్షన్‌ప్లాన్ ప్రకటించాలని, గిరిజనులకు మంత్రివర్గంలో స్థానం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కుటుంబరావు, గోవింద్, లక్ష్మయ్య, నగేష్, సత్యనారాయణ, చందర్, వెంకటేశ్వర్లు, శంకర్ పాల్గొన్నారు.

మహిళలకు పని ప్రదేశాల్లో భద్రత కల్పించాలి

కొత్తగూడెం అర్బన్, అక్టోబర్ 29 : మహిళలకు పని ప్రదేశాల్లో భద్రత కల్పించాలని ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గౌని నాగేశ్వరరావు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. కలకత్తా, కేరళ రాష్ట్రాల్లో పారిశుధ్య కార్మికులపై జరిగిన అత్యాచారం, హత్యలను ఖండిస్తూ కేంద్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు మంగళవారం రైటర్ బస్తీలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గనులు, బడులు, కార్ఖానాల్లో పనిచేసే మహిళ కార్మికులు, ఉద్యోగులకు రక్షణ లేకుండా పోయిందని వారికి రక్షణ కల్పించాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, న్యాయ స్థానాలపై ఉందన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన ఎమ్మెల్యే తెల్లం

సీఎం రేవంత్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే, నాయకులు

భద్రాచలం, అక్టోబర్ 29: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, ఎంపీ బలరాం నాయక్‌తో కలిసి హైదరాబాద్‌లోని ఆయన చాంబర్‌లో మంగళవారం కలిశారు. భద్రాచలం పట్టణ అభివృద్ధికి నిధులు కేటాయించాలని, చర్ల, దుమ్ముగూడెం కేంద్రంగా పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని, సీతారామ ప్రాజెక్టు పనులు త్వరగా పూర్తిచేయాలని, భద్రాచలం ఏరియా ఆసుపత్రిలో ప్రభుత్వ వైద్యుల పోస్టులు భర్తీచేయాలని, భద్రాచలం ఏజెన్సీ కేంద్రంగా లా కళాశాల ఏర్పాటు చేయాలని తదితర సమస్యలతో కూడిన వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ భోగాల శ్రీనివాసరెడ్డి, భీమవరపు వెంకటరెడ్డి, బుడగం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పవర్ లిఫ్టింగ్ క్రీడాకారుడిని అభినందించిన సీఎం

భద్రాచలం సిటీస్టైల్ జిమ్ పవర్ లిఫ్టింగ్ క్రీడాకారుడు మోడెం వంశీని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అభినందించారు. మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాంనాయక్, ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, స్పోర్ట్స్ చైర్మన్ శివసేనరెడ్డి, కోచ్ జివి.రామిరెడ్డి(జిమ్ రెడ్డి)లు క్రీడాకారుడు మోడెం వంశీతో సోమవారం హైదరాబాద్‌లో సీఎంను కలిశారు. ఏజెన్సీ ప్రాంతానికి చెందిన వంశీ ఇండియాకు పవర్ లిఫ్టింగ్‌లో బంగారు పతకాలు తీసుకురావడం గర్వకారణమని సీఎం అన్నారు.

ప్రతి ఇంట్లో రక్తదాతలు ఉండాలి

ఆర్టీసీ ఎండీ సజ్జనార్

మాట్లాడుతున్న ఆర్టీసీ ఎండీ సజ్జనార్

లక్ష్మీదేవిపల్లి, అక్టోబర్ 29: యంగ్ ఇండియన్ బ్లడ్ డోనర్స్ క్లబ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో మంగళవారం జరిగిన కార్యక్రమంలో అన్ని రాష్ట్రాల్లో విశిష్ట సేవలందించిన వారికి యంగ్ ఇండియన్ 2024 జాతీయస్థాయి అవార్డులు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆర్టీసీ ఎండీ విసీ సజ్జనార్ మాట్లాడుతూ ప్రతి ఇంట్లో రక్తదాతలను తయారు చేయాలన్నారు. సహాయం తీసుకోవడమే కాదు.. తిరిగి చేయడం కూడా నేర్చుకోవాలన్నారు. సమాజం పట్ల బాధ్యతగా ఉండాలని, యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని అన్నారు. కార్యక్రమంలో టీజీవోఎస్ స్టేట్ ప్రెసిడెంట్ ఏలూరి సాంబశివరావు, ఫౌండేషన్ ముఖ్యసలహాదారు వెంకట పుల్లయ్య, సభ్యుడు వినోద్‌బాలు, నరేష్, శ్రీరామ్, మహేందర్‌రెడ్డి, అయ్యప్ప, ప్రసాద్, సయ్యద్, మేడిది వెంకటేశ్వరరావు, కన్నా, నరేష్ పాల్గొన్నారు.

సమగ్ర కుటుంబ సర్వే పక్కాగా నిర్వహించాలి

వీసీలో పాల్గొన్న కలెక్టర్, అధికారులు

భద్రాద్రి కొత్తగూడెం, అక్టోబర్ 29 (నమస్తే తెలంగాణ): వచ్చే నెల 6వ తేదీ నుంచి సమగ్ర కుటుంబ సర్వే పక్కాగా నిర్వహించాలని మధిర తహసీల్దార్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్లకు ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క దిశానిర్దేశం చేశారు. అనంతరం కలెక్టరేట్‌లో కలెక్టర్ జితేష్ వి పాటిల్ జిల్లా అధికారులతో సమావేశమయ్యారు. కుటుంబసర్వేను అదనపు కలెక్టర్ పర్యవేక్షించాలన్నారు. ఇందుకు చేపట్టాల్సిన పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఎన్యుమరేటర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లను నియమించాలన్నారు. బుధవారం ఉదయం 9గంటలకల్లా తహసీల్దార్ల కార్యాలయాల్లో ఎంపీడీవోలు, సర్వే సిబ్బందికి శిక్షణా తరగతులు నిర్వహించాలన్నారు. ఈ వీసీలో మంత్రులు ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణ గురించి వివరించారు. సమావేశంలో సీఈవో చంద్రశేఖర్, మైనార్టీ అధికారి సంజీవరావు, డీపీవో చంద్రమౌళి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

భద్రాద్రి రామయ్యకు నిత్యకల్యాణం

భద్రాచలం, అక్టోబర్ 29: భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానంలో మంగళవారం సీతారాములకు అర్చకులు నిత్యకల్యాణం నిర్వహించారు. తెల్లవారుజామున స్వామివారికి సుప్రభాతసేవ, ఆరాధన, ఆరగింపు, సేవాకాలం, నిత్యహోమాలు, నిత్యబలిహరణం తదితర నిత్యపూజలు జరిపారు. ఆంజనేయస్వామికి ఉదయం పంచామృతాభిషేకం చేసి తమలపాకులు, సింధూరంతో పూజలు చేశారు. అనంతరం స్వామివారి నిత్యకల్యాణ మూర్తులను బేడా మండపానికి తీసుకువచ్చి నిత్యకల్యాణం నిర్వహించారు.

విద్యావంతులుగా తీర్చిదిద్దాలి

కొత్తగూడెం ఎడ్యుకేషన్, అక్టోబర్ 29: విద్యార్థులను విద్యావంతులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదేనని కొత్తగూడెం ఎంఈవో డాక్టర్ ఎం.ప్రభుదయాల్ అన్నారు. మంగళవారం చిట్టిరామవరం, టూ ఇంక్లైన్, త్రీ ఇంక్లైన్, రామవరం ప్రభుత్వ పాఠశాలలను సందర్శించి విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి భోజనం చేసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలల్లో విద్యార్థుల హాజరుశాతం, తరగతి గదుల్లో ఉపాధ్యాయుల బోధనాశైలి, విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించి, విద్యాభివృద్ధికి సంబంధించి పలు సూచనలు చేశారు.

అంజనాపురంలో గర్భకోశ చికిత్సా శిబిరం

బూర్గంపహాడ్, అక్టోబర్ 29: మండలంలోని అంజనాపురం గ్రామంలో మంగళవారం గర్భకోశ చికిత్సా శిబిరం నిర్వహించారు. 5 ఆవులు, 25 గేదెలు, 20 దూడలకు పీవీసీ వైద్యులు రాజేందర్ గర్భకోశ చికిత్సలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. జబ్బుల నివారణ, పాడిపశువుల పెంపకంలో మెలకువలు, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి రైతులకు అవగాహన కల్పించారు.

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా యావన్మంది ప్రజలకు తెలియజేయునది ఏమనగా నా కైయింటు అయిన **కాసాని పద్మ శేఖర్**, తండ్రి. పుల్లారావు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, అశ్వారావుపేట మండలం, అశ్వారావుపేట గ్రామ కాపురస్తుడు అనువారు ఈ దిగువ తెల్పబడిన షెడ్యూలు దాఖల ఆస్తిని అనగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలం, అశ్వారావుపేట గ్రామ రెవిన్యూ పరిధిలో సర్వేనెం. 1283, 1246 దాఖల 48.475 చ.గ. విస్తీర్ణము నందు ఉండబడిన ''లక్కీ హోమ్స్'' అను పేరు గల అపార్మెంట్‌లో మూడవ అంతస్తు నందు హౌస్ నెం. 9-47/2P2 గల ఫ్లాటు దాఖల ఆస్తిని ది. 30-03-2013 తేదీన శ్రీ సాయి ఓజస్వి కన్‌స్ట్రక్షన్ మేనేజింగ్ పార్ట్నర్ అయిన మండవ విజయకుమార్ అను వారి నుండి డాక్యుమెంట్ నెం. 1279/2013 SRO సత్తుపల్లి అను విక్రయ దస్తావేజు ద్వారా క్రయము పొంది యున్నారు. సదరు శ్రీ సాయి ఓజస్వి కన్‌స్ట్రక్షన్ మేనేజింగ్ పార్ట్నర్ అన మండవ విజయకుమార్ అను వారు అశ్వారావుపేట గ్రామ రెవిన్యూ సర్వే నెం. 1283, 1246 దాఖల ఫ్లాట్ నెం. 29, 30, 31, 32, 33, 55, 56, 57, 58, 59 దాఖల ఏక ప్రతిగా వున్న 1939 చ.గ. విస్తీర్ణమును విక్రయ దస్తావేజు నెంబర్లు అయిన 3584/2010, 3585/2010, 3586/2010, 3587/2010, 3588/2010 SRO సత్తుపల్లి అను దస్తావేజుల ద్వారా వివిద వ్యక్తుల అయిన శీమకుర్తి విశ్వేశ్వరరావు, శీమకుర్తి